క్లుప్తంగా

ఘనంగా రామాలయ ప్రారంభోత్సవం



హోమం చేస్తున్న వేదపండితులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన జెడ్పీ చైర్మన్



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

విజయనగరం టౌన్/ గంటస్తంభం : విజయసాగర దుర్గా మల్లేశ్వరి అమ్మవారి ఆలయంలో హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులైన శ్రీసత్య – సత్యనారాయణరావు, విజయలక్ష్మి – వెంకటసత్య ఆచారి జంటలకు శనివారం వివాహం జరిపించారు. ఈ వివాహ వేడుకలకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, మజ్జి సరిసహస్ర, వర్రి నరసింహమూర్తి, జైహింద్‌కుమార్, ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సిరి సహస్ర నూతన దంపతులకు పట్టు వస్త్రాలు అందజేశారు.

ఫిట్‌నెస్ కేంద్రం ఎత్తే వరకూ పోరాటం



ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ర్యాలీగా వస్తున్న ఆటో కార్మికులు, యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్: గరివిడి మండలం అచ్యుతాపురం వద్ద ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఎత్తివేసే వరకూ పోరాటం ఆగదని విజయదుర్గ ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నీలాపు అప్పలరాజు రెడ్డి, రెడ్డి నారాయణరావు అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్మికులకు నష్టం చేసే ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాలి సన్యాసిరావు, ధర్మారావు, నారాయణరావు, కంది రాము, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

• తహసీల్దార్ సుదర్శనరావు



బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

నెల్లిమర్ల: ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పి. సుదర్శనరావు హెచ్చరించారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ అధికారులు శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని చంద్రబాబుకాలనీలో సర్వే నంబర్ 60లోని ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కూటమి నాయకులు ఆక్రమించేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సుదర్శనరావు ఆర్ఐ వేణుగోపాల్, వీఆర్ఓలు గోవింద్, వెంకటలక్ష్మి, వెంకటరమణ, వీఆర్ఏ సూరిలను గ్రామానికి పంపించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.

హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలి

• ఎమ్మెల్సీ గాదెకు ఏపీహెచ్‌ఎం అసోసియేషన్ ఉత్తరాంధ్ర జిల్లాల కమిటీ వినతి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ తరగతులు ఏర్పాటు చేసినటువంటి 510 హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. హైస్కూల్ ప్లస్‌లను బలోపేతం చేస్తూ అవసరమైనటువంటి స్టాఫ్‌ని నియమించాలని కోరారు. అలాగే సర్వీస్ రూల్స్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఏపీహెచ్‌ఎం అసోసియేషన్ ఉత్తరాంధ్ర జిల్లాల కమిటీ ప్రతినిధులు టి.సన్యాసిరాజు, దాలినాయుడు, శాస్త్రిచ, తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

• బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్



డెంకాడ: బెటాలియన్ కమాండెంట్ మలికాగార్గ్‌ను సత్కరిస్తున్న వైద్య అధికారులు,ఇతర మహిళలు



విజయనగరం అర్బన్: మహిళా టీచర్లను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా సంఘం ప్రతినిధులు



విజయనగరం టౌన్: మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు ఉపన్యాసకులు రమాగీతాదేవి

డెంకాడ: మహిళలు అవకాశాలను అందిపుచ్చుకుని అన్ని రంగాల్లో రాణించాలని ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ మలికా గార్గ్ అన్నారు. చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లోని యూనియన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మలికా గార్గ్, తదితరులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో యూనిట్ ఆస్పత్రి డాక్టర్ మనోజ్ఞ, మినిస్టీరియల్ అధికారులు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో..

విజయనగరం అర్బన్: పట్టణంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏపీటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో పలువురు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ బుఖారీ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్తేరు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు జీవీ ప్రసాద్, కె.వెంకట్రావు, తిరుమలరెడ్డి శ్రీనివాసరావు, బొంతు రామునాయుడు, జి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మహిళలకు సంపూర్ణ భాగస్వామ్యం..

విజయనగరం టౌన్: అభ్యుదయ రచయితల సంఘం, జిల్లా గ్రంథాలయ సేవాసంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక గురజాడ స్వగృహంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు ఉపన్యాసకుడు ఎం.రమాగీతాదేవి మాట్లాడుతూ.. మహిళలు ఇప్పటికీ అనేక వివక్షలకు గురవుతూ ద్వితీయ పౌరులుగానే పరిగణింపబడుతున్నారని, ఈ దేశంలో వారికి సంపూర్ణ భాగస్వామ్యం దక్కాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త, సంఘ సేవకురాలు భోగరాజు సూర్యలక్ష్మి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ గోటేటి హిమబిందు, పోతుల శ్రీలక్ష్మి, అబ్దుల్ రవూఫ్, జీఎస్.చలం, రత్నాల బాలకృష్ణ, తదితరులు నిర్వహించారు.

అన్ని రంగాల్లో రాణించాలి..

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కమిషనర్ కె. అప్పలరాజు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని, కౌన్సిలర్లు, సచివాలయాల కార్యదర్శులు, మెప్మా ఆర్పీలు, కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీలో..

విజయనగరం అర్బన్: కేంద్రియ గిరిజన యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా 'మహిళలు మరియు బాలికల కోసం: సమానత్వం, హక్కులు, సాధికారిత' అనే అంశంపై రూపొందించిన మూకీ నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి మాట్లాడుతూ.. మహిళలు సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా అభివృద్ధి చెందినపుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీసీ అటానమస్ కాలేజీ ప్రొఫెసర్ పద్మశ్రీ దమయంతి బేష్రా, యూనివర్సిటీ విమెన్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి, మహిళా అధ్యాపకులు డాక్టర్ కుసుమ్, డాక్టర్ దివ్య, డాక్టర్ లత, డాక్టర్ ప్రమాచటర్జీ, డాక్టర్ దేభంజనా నాగ్, జాగరపు సుమలత, మహిళా సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వంటింటికే పరిమితం కాకూడదు..

విజయనగరం టౌన్: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ ముందుండాలని గురాన రాధిక పిలుపునిచ్చారు. విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోటవద్దనున్న ఎస్.కన్వెన్షన్‌లో జరిగిన వేడుకల్లో 30 మంది మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో గురాన అయ్యలు, కరణం శివరామకృష్ణ, హారతి సాహూ, షేక్ ఇల్తామాష్, అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రఘు, రాము, శివవర్మ పాల్గొన్నారు.



నెల్లిమర్ల: మహిళలను సత్కరిస్తున్న నగర పంచాయతీ కమిషనర్, తదితరులు



విజయనగరం అర్బన్: మూకీ నాటక కళాకారులతో వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి



విజయనగరం టౌన్: సన్మానం పొందిన మహిళలతో విజయనగరం యూత్ ఫౌండేషన్ ప్రతినిధులు

ఫిట్‌నెస్ ఏజెన్సీని రద్దు చేయాలి



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆటో కార్మికులు

డెంకాడ: గరివిడి మండలంలోని అచ్యుతాపురం వద్ద ఏర్పాటు చేసిన వాహన ఫిట్‌నెస్ ప్రైవేట్ ఏజెన్సీ (వేదాంత)ను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు, ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నాతవలస వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. అలాగే ఈ నెల పదో తేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ మాట్లాడుతూ.. యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చాలా మంది తమ భూములను అమ్ముకుని ఆటోలు నడుపుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని చెప్పారు. ఫిట్‌నెస్ పత్రాల మంజూరు బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించడం సరికాదన్నారు. వేదాంత ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జెండర్ బడ్జెట్ ప్రవేశపెట్టాలి

విజయనగరం టౌన్: మహిళల ఆర్థిక సమానత్వం కోసం బడ్జెట్‌లో జెండర్ బడ్జెట్ ప్రవేశపెట్టాలని డీబీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గంజిపేట మున్సిపల్ హైస్కూల్‌లో మహిళల హక్కులు – మానవ హక్కులనే అంశంపై మౌంట్ ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్, ప్రజల సంఘం ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం సూచిస్తున్నా మహిళా సమానత్వం సాధించలేకపోతున్నామన్నారు. కార్యక్రమలో విశ్వ ఎన్‌జీఓ కాంచన, డీబీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కొత్తపల్లి స్వప్న, జిల్లా కోఆర్డినేటర్ కోరుకొండ వరలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

మహిళా హోంగార్డు ఇంటిలో హోం మినిస్టర్



మహిళా హోం గార్డ్ ప్రమీలకు చీర, పసుపు, కుంకుమలు ఇస్తున్న హోం మంత్రి అనిత

విజయనగరం క్రైమ్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం నగరానికి వచ్చిన హోం మినిస్టర్ అనిత పోలీస్ క్వార్టర్‌లో నివాసముంటున్న మహిళా హోంగార్డు ప్రమీల ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలు అన్ని రంగాల్లోర రాణిస్తూ, విధులను సమర్థవంతంగా నిర్వహించినప్పుడే ఆదర్శంగా నిలుస్తారని చెప్పారు. ఈ సందర్భంగా హోంగార్డు ప్రమీలకు చీర, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ వకుల్ జిందల్, ఎమ్మెల్యే అధితి, ఓఎస్‌డీ అనిల్ పులిపాటి, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, పలువురు సీఐలు, ఆర్ఎస్సైలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించే వరకూ పోరాటం

• సీపీఎం నాయకులు




ప్రజా చైతన్యయాత్ర ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు

విజయనగరం గంటస్తంభం: పట్టణంలోని హుద్‌హుద్ ఇళ్ల సముదాయం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించే వరకూ పోరాటం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ప్రచార చైతన్యయాత్రను లంకాపట్నం వద్ద శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. హుద్‌హుద్ ఇళ్ల సముదాయం వద్ద తాగునీరు, విద్యుత్, రహదారులు, తదితర సదుపాయాలు కల్పించలేదన్నారు. 2009లో నిర్మించిన టిడ్కో ఇళ్లు నేటికీ లబ్ధిదారులకు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప పేదలకు ఇళ్లు అందించడం లేదన్నారు. మరోవైపు ఎన్నికల్లో అనేక హామీలు అమలు చేయలేదని, బడ్జెట్‌లో నిధులు కేటాయించడం లేదని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు, మూడు గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ. 1500 ఇస్తామన్న హామీలే ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోగా.. విద్యుత్ చార్జీలు, ఆస్తి పన్ను వంటి భారాలు వేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, సురేష్, జగన్మోహనరావు, వెంకటేష్, రమణ, జగదాంబ, రామచంద్రరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

• ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు



ఆమోదించిన తీర్మానాలతో మహిళా ఉద్యోగులు

విజయనగరం గంటస్తంభం: సమగ్రశిక్ష ప్రాజెక్ట్‌లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా జేఏసీ వైస్ చైర్‌పర్సన్ పి.తేజేశ్వరి అన్నారు. ఫెడరేషన్ జేఏసీ విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ఆమె మాట్లాడుతూ.. విద్యారంగంలో కీలక భూమిక పోషిస్తున్నప్పటికీ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పీఎఫ్, హెల్త్‌కార్డ్స్ వంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మంగమ్మ, కేజీబీవీ నాయకులు సీహెచ్ రోహిణి, సీఆర్‌ఎంటీ నాయకులు చిన్నమ్మలు, ద్రాక్షాయిని, పార్ట్ టైమ్ యూనియన్ నాయకులు పార్వతమ్మ, ఔట్ సోర్సింగ్ సీఆర్‌ఎంటీ యూనియన్ నాయకుల రమేష్, పార్ట్ టైమ్ టీచర్స్ యూనియన్ నాయకులు కృష్ణమూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన ఎల్లమ్మ సంబరం...

• భక్తి శ్రద్ధలతో సిరిమానోత్సవం
• తరలివచ్చిన వేలాది మంది భక్తులు



సిరిమాను ఊరేగింపు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడలో ఎల్లమ్మ తల్లి జాతర శనివారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచే భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి పెద్ద ఎల్లమ్మ తల్లి అలాగే పక్కనే ఉన్న చిన్నమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం డప్పు వాయిద్యాల నడుమ ఎల్లమ్మ తల్లిని చదురు నుంచి గ్రామ పొలిమేర వరకు మూడుసార్లు ఊరేగించారు.

సిరిమానోత్సవాన్ని పోటెత్తిన భక్తులు

చుట్టు పక్కల ఉన్న 20 గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి ఎల్లమ్మతల్లి సిరిమానోత్సవాన్ని కనులారా తిలకించి పసుపు, కుంకుమలను సమర్పించుకున్నారు. గ్రామానికి చెందిన సబ్బవరపు అచ్యుతరావు పూజారిగా సిరిమానును అధిరోహించారు. ఎల్లమ్మ తల్లి చదురు నుంచి సతివాడ జంక్షన్ వరకు సిరిమానోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, నాయకులు కోరాడ శ్రీను, ఆల్తి నల్లి బాబు, తదితరులు పాల్గొన్నారు.

తప్పులను సరిదిద్దాలి..



చిల్లపేటకు రేషన్ సరుకులు అందించాలని సీఎస్‌డీటీని కోరుతున్న ప్రజా ప్రతినిధులు

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండపాలెం, పినవేమలి గ్రామాల్లో చేపట్టిన భూ సర్వేలో తప్పులను సరిదిద్ది రైతులకు న్యాయం చేయాలని కోరుకొండపాలెం గ్రామ సర్పంచ్ ఎస్.కృష్ణ రెవెన్యూ అధికారులను కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా నిర్వహించిన సమీక్షలో అధికారులు మాట్లాడగా.. సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. చిల్లపేట పంచాయతీలో ఏడాది కాలంగా రేషన్ సరుకులు అందించకపోవడంతో గ్రామస్తులు సమీప గ్రామాలకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని సర్పంచ్ సభ దృష్టికి తీసుకురాగా.. కొద్ది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని సీఎస్‌డీటీ రామారావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కర్రోతు నారాయణ, కొసర నిర్మల, మండల శాఖ అధికారులు, పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రాణాలకు తెగించి శిక్షణ..



పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి వద్ద మత్స్యకారుల పిల్లల చిన్న చిన్న పడవుల సాయంతో సముద్రంలో చేపల వేటకు కావాల్సిన శిక్షణ పొందుతున్నారు. పది సంవత్సరాల్లోపు చిన్నారులు సముద్రపు కెరటాలకు ఎదురెళ్లడం ప్రమాదమైనప్పటికీ.. తమ జీవన పోరాటానికి తప్పదని మత్స్యకారులు చెబుతున్నారు.

- పూసపాటిరేగ

వితరణ



పూసపాటిరేగ మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా అన్న సమారాధనకు కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, గోవిందపురం వైస్ సర్పంచ్ బాలా అప్పలరాజులు 50 వేల రూపాయలు వితరణగా అందజేశారు. ఈ మేరకు సర్పంచ్ టి. సీతారామ్‌కు శనివారం నగదు అందజేశారు. కార్యక్రమంలో పతివాడ శ్రీనివాసరావు, దేశెట్టి గణేష్, పట్నాన గురుమూర్తి, రాముడు, పంతులు తదితరులు పాల్గొన్నారు.

- పూసపాటిరేగ

పుష్పాలంకరణలో శ్రీనివాసుడు..



విజయనగరంలోని టీటీడీ కళ్యాణ మండపం ఆవరణలో కొలువైన వేంకటేశ్వరస్వామి శనివారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు పీవీ నరసింహాచార్యుల ఆధ్వర్యంలో వేకువజాము నుంచి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం పుష్పాలంకరణలో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

- విజయనగరం టౌన్

జన్యుపరమైన లోపాల వల్ల హీమోఫిలియా..



జన్యుపరమైన లోపాల వల్ల హీమోఫిలియా వ్యాధి వస్తుందని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి హెచ్ఓడీ సుదర్శి అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో హీమోఫిలియా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. హీమోఫిలియా రోగులకు రక్తం గడ్డకట్టదన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సాయిబాబా, డాక్టర్ లక్ష్మీసౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

- విజయనగరం ఫోర్ట్

రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయం

• ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



రక్తదానం చేసిన మహిళలకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం చేయడానికి మహిళలు ముందుకు రావడం అభినందనీయమని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. శనివారం స్థానిక ఎంఆర్ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడమేనన్నారు. రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతిఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. 51 మంది రక్తదానం చేయగా అందులో 17 మంది మహిళలుండడం విశేషం. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ జీవనరాణి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి కె. రాణి, ఐసీటీసీ సూపర్‌వైజర్ సాక్షి గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

డెంకాడ: మండలంలోని ఏపీఎస్పీ బెటాలియన్ వద్దనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 9 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతలవలస, ఐదో ఏపీఎస్పీ బెటాలియన్, రఘుమండ, గుండాలపేట, బొడ్డవలస, కృష్ణాపురం, వెలంపేట, గెద్దవానిపాలెం, జొన్నాడ, ఆకులపేట, డి.తాళ్లవలస, దువ్వపేట, సత్యానారాయణపురం, చెల్లూరు పరిశ్రమ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట మాజీ సర్పంచ్ బూర్లె సత్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు, ఎస్సీ సెల్ నాయకుడు రేగాన శ్రీనివాసరావు, నాయకులు రాంబార్కి రామారావు, నడుపూరి పరిసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.